క్లుప్తంగా

కంకిపాడు పీఎస్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

కంకిపాడు: కంకిపాడు పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు బుధవారం తనిఖీ చేశారు. ఆకస్మిక పర్యటనలో భాగంగా కంకిపాడు పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. వివిధ కేసుల్లో అదుపులోకి తీసుకున్న నిందితులతో మాట్లాడారు. రికార్డులను పరిశీలించి కేసుల నమోదు, దర్యాప్తుపై సిబ్బందితో సమీక్ష చేశారు. పరిశీలనలో సీఐ జె.మురళీకృష్ణ, ఎస్‌ఐ డి.సందీప్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: పోరంకి సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు తెలిపారు. సాలిపేట ఫీడర్ మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 8 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామన్నారు. దీని కారణంగా సాలిపేట, ఏవీఎం గార్డెన్స్, బందరు రోడ్డు, సిద్ధిఖ్‌నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

రేషన్ కార్డులో సభ్యులకు ఈకేవైసీ తప్పనిసరి

ఉయ్యూరురూరల్: ఉయ్యూరు మండలంలోని రేషన్ కార్డులో ఉన్న సభ్యులందరూ తప్పనిసరిగా ఈ కేవైసీ పూర్తి చేసుకోవాలని ఉయ్యూరు తహసీల్దార్ సురేష్ కుమార్ కోరారు. ఈకేవైసీ పూర్తికాని సభ్యులకు ప్రభుత్వ పథకాలు మంజూరు చేయు సమయంలో ఇబ్బందులు కలిగే అవకాశం ఉన్నందున రేషన్ కార్డులో ఉన్న సభ్యులందరూ ఈకేవైసీ సంబంధిత డీలర్ దగ్గర పూర్తి చేసుకోవాలన్నారు. మండలంలో మొత్తం 61,475 సభ్యులకు 56,842 మంది ఈకేవైసీ పూర్తి చేసుకున్నారని మిగిలిన 4,633 మంది ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పెనమలూరు: గంగూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు కావడంతో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెనమలూరు ఆంజనేయస్వామివారి ఆలయం ప్రాంతానికి చెందిన చోడవరపు బాలరాజు ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తాడు. అతను కుటుంబ సభ్యులతో నివాసం ఉంటున్నాడు. కాగా మంగళవారం రాత్రి అతను గంగూరు చేపల కుండీల వద్ద రోడ్డు దాటుతుండగా కంకిపాడు వైపు నుంచి విజయవాడ వైపునకు వస్తున్న బైక్ ఢీ కొట్టింది. ఈ ఘటనలో బాలరాజుకు గాయాలు కావడంతో బాలరాజును విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్సకు చేర్చారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కొనసాగుతున్న ఆధార్ నమోదు క్యాంపులు

కంకిపాడు: ఆధార్ నమోదు ప్రత్యేక క్యాంపులు కొనసాగుతున్నాయి. కంకిపాడు, మద్దూరు సచివాలయాల్లో చేపట్టిన క్యాంపులు బుధవారంతో ముగిశాయి. రెండు రోజుల్లో 55 మంది తమ ఆధార్ నమోదు చేయించుకుని, ఆధార్ సేవలను పొందారు. ఈ నెల 27, 28 తేదీల్లో దావులూరు, గొడవర్రు సచివాలయాల్లో ఆధార్ నమోదు శిబిరాలు నిర్వహిస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ పి.అనూష కోరారు.

దివ్యాంగులకు చిత్రలేఖనం పోటీలు



కంకిపాడు: స్వచ్ఛ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కంకిపాడులోని భవిత కేంద్రంలో బుధవారం దివ్యాంగులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఆర్‌ఈసీ లిమిటెడ్ మహారత్న కంపెనీ సౌజన్యంతో పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన దివ్యాంగులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు కె.మురళీకృష్ణ, వి.సోనియా గోపిక, ఎంపీఎంపీ హెచ్‌ఎం పి.సాంబశివరావు, ఉపాధ్యాయులు ఎం.పద్మజ, ఎం.వసంతరాజు, ఐఈ రీసోర్సు టీచర్లు పీవీడీ నాగేశ్వరి, ఎం.దీప్తి పాల్గొన్నారు.

వైభవంగా నేతాజీ విద్యాలయ వార్షికోత్సవం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలం వేలేరులోని కేంద్ర ప్రభుత్వ విద్యాసంస్థ నేతాజీ సుభాష్‌చంద్రబోస్ ఆవాసీయ విద్యాలయ(అమ్మ నిలయం) వార్షిక వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. పాఠశాల విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, పూర్వ విద్యార్థుల సందడి మధ్య వార్షిక వేడుకలు కోలాహలంగా సాగాయి. ముఖ్య అతిథిగా హాజరైన సమగ్రశిక్ష ఏపీసీ ఫణి ధూర్జటి మాట్లాడుతూ తల్లిదండ్రులు లేక నిరాశ్రయులైన చిన్నారుల కోసం కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ విద్యాసంస్థకు దాతలు అందిస్తున్న తోడ్పాటు అభినందనీయమని కొనియాడారు. విద్యా సంవత్సరంలో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. ఎంఈవో శ్రీరామ్ బాలాసింగ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సుంకర సుభాష్‌చంద్రబోస్, పాఠశాల స్థల దాత ఆవిర్నేని రాధాకృష్ణ, వార్డెన్ డి.సునీత, ఐఈడీ కోఆర్డినేటర్ రాంబాబు పాల్గొన్నారు.

భూ యాజమాన్య హక్కులు దక్కేనా ?

- వీఎస్ పురం పరిధిలో అసైన్డ్ భూమిని కేటాయించిన ప్రభుత్వం
- మూడు దశాబ్దాలుగా లబ్ధిదారుల ఎదురుచూపులు



రెవెన్యూ సదస్సులో తహసీల్దార్‌కు అర్జీ అందజేస్తున్న సాగుదారులు(ఫైల్)

గన్నవరం: ''స్థానిక కొత్తపేటకు చెందిన వెంగళ రంగారావుకు 32 ఏళ్ల క్రితం కేసరపల్లి శివారు వీఎస్ పురం పరిధిలో 25 సెంట్ల సాగుభూమిని ప్రభుత్వం అసైన్డ్ చేసి ఇచ్చింది. సదరు భూమికి డి- ఫారం పట్టా, పాస్‌బుక్‌లను పంపిణీ చేసిన అధికారులు 22ఏ నుంచి మాత్రం తొలగించలేదు. దీంతో 22 ఏ నుంచి విముక్తి కోరుతూ రంగారావు ఏళ్ల తరబడి రెవెన్యూ అధికారులు చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. చివరికి అనారోగ్యానికి గురైన రంగారావు వైద్య ఖర్చులకు కూడా డబ్బులు లేని పరిస్థితుల్లో ఇటీవల మృతి చెందాడు.''

ఇది మండలంలో అసైన్డ్ భూములు పొందిన పేదల దుస్థితి. ప్రభుత్వం భూమి కేటాయించి దశాబ్దాలు గడుస్తున్నప్పటికీ యాజమాన్య హక్కులు దక్కక లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. సదరు భూములకు పాస్‌బుక్‌లు ఉన్నప్పటికీ రెవెన్యూ రికార్డుల్లో 22ఏ కింద ఉండడంతో బ్యాంక్‌లు రుణాలు ఇవ్వని పరిస్థితి. అసైన్డ్ భూములకు హక్కులు కల్పించాలని 20 ఏళ్ల క్రితం ప్రభుత్వం జీవోలు జారీ చేసినప్పటికీ ఆచరణలో అమలుకు నోచుకోవడం లేదు. ముఖ్యంగా కేసరపల్లి శివారు వీఎస్ పురం పరిధిలో అసైన్డ్ భూములు పొందిన పేదల పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. తమ భూములకు 22ఏ నుండి విముక్తి కల్పించాలని ఎన్నోసార్లు అధికారులకు అర్జీలు పెడుతున్నా పరిష్కారానికి నోచుకోవడం లేదని సాగుదారులు ఆవేదన చెందుతున్నారు.

అప్పులు పుట్టని దుస్థితి..

వెంకటనరసింహాపురం పరిధిలోని ఆర్ఎస్ నంబర్ 408లోని 7.50 ఎకరాలు అసైన్డ్ భూమిని 1993లో ప్రభుత్వం పేద కుటుంబాలకు చెందిన 28 మందికి 25 సెంట్లు చొప్పున పంపిణీ చేసింది. సదరు భూమిని రెవెన్యూ అధికారులు 1994లో విడగొట్టి లబ్ధిదారులైన పేదలకు భూమిని అప్పగించారు. అప్పటి నుంచి ఆ భూములను పేదలు సాగు చేసుకుంటూ పంటలు పండించుకుంటున్నారు. సాగుదారుల విజ్ఞప్తుల మేరకు రెవెన్యూ అధికారులు 2007లో సదరు భూములకు పాస్ పుస్తకాలను కూడా పంపిణీ చేసింది. అయితే పిల్లల చదువులు, పెళ్లిళ్లు, వ్యవసాయ అవసరాల నిమిత్తం ఆ భూములపై బ్యాంక్‌ల్లో రుణాలు తెచ్చుకునే పరిస్థితి సాగుదారులకు లేకుండా పోయింది. సదరు భూములు రెవెన్యూ రికార్డుల్లో 22ఏ కింద ఉండడంతో బయట కూడా అప్పులు పుట్టని దుస్థితి. ఈ నేపథ్యంలో గత ప్రభుత్వం జీవో నంబర్ 596 ద్వారా 20 ఏళ్లు దాటిన అసైన్డ్ భూములపై సాగుదారులకు యాజమాన్య హక్కు కల్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ జీవోకు అనుగుణంగా పలు గ్రామాల్లోని అసైన్డ్ భూములపై సాగుదారులకు యాజమాన్య హక్కులను అధికారులు కల్పించారు. ఎన్నికల కారణంగా పేదల భూములకు మోక్షం దక్కలేదు.

వినతి పత్రాల అందజేత..

ఇప్పటికైనా ఇరవై ఏళ్లు పూర్తయిన తమ భూములకు యాజమాన్య హక్కులు కల్పించాలని సాగుదారులు రెవెన్యూ అధికారులు వినతులు సమర్పిస్తున్నారు. పేదల అర్జీలపై స్థానిక తహసీల్దారు కార్యాలయ అధికారులు రికార్డు తయారుచేసి గుడివాడ ఆర్డీఓకు పంపితే, అక్కడి నుంచి ఆ ఫైల్ జిల్లా కలెక్టర్‌కు వెళ్లాల్సి ఉంది. దీనిపై జిల్లా కలెక్టర్ నిర్ణయం తీసుకుని 22ఏ నుంచి ఆ భూములను తొలగిస్తూ ఉత్తర్వులు ఇవ్వాల్సి ఉంటుంది. అప్పుడే పేదలకు సదరు భూములపై పూర్తి హక్కులు లభిస్తాయి. అయితే ఆ దిశగా అడుగులు ముందుకు పడకపోవడంతో ఆ భూములపై యాజమాన్య హక్కుల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూపులు చూడాల్సి వస్తోందని పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు మానవతా దృక్పథంతో స్పందించి తమకు న్యాయం చేయాలని సాగుదారులైన పేదలు వేడుకుంటున్నారు.

భూ హక్కు కల్పించాలి..



పేద కుటుంబాలకు భరోసా కల్పించేందుకు 1993లో ప్రభుత్వం వీఎస్ పురం పరిధిలో 25 సెంట్ల సేద్యపు భూమిని కేటాయించింది. అప్పటి నుంచి ఆ భూమిలో సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాను. అయితే భూములు ఇచ్చి మూడు దశాబ్దాలు గడుస్తున్నప్పటికీ అధికారులు 22ఏ నుంచి తొలగించలేదు. దీని కోసం పలుమార్లు రెవెన్యూ అధికారులకు వినతులు అందజేశాం. ఇప్పుడు 70 ఏళ్లు పైబడిన తనకు కార్యాలయాలు చుట్టూ తిరిగే ఓపిక లేదు. అధికారులే తమ గోడును అర్థం చేసుకుని న్యాయం చేయాలి.

– తిరివీధి జక్రయ్య, గన్నవరం

భూ రికార్డుల్లో తప్పుల సవరణ పేరుతో వసూళ్లకు తెర

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామ రెవెన్యూ రికార్డుల్లో తప్పులు సరిచేయడానికి రెవెన్యూ ఉద్యోగి రేటు నిర్ణయించి వసూళ్లకు తెరలేపాడు. నున్న గ్రామం జమిందారి విలేజ్ కావడంతో రెవెన్యూ రికార్డుల్లో రైతులకు చెందిన పట్టా భూములు చెరువు, ఇనామ్, అస్సైన్డ్, సీలింగ్ భూములుగా నమోదైందని, వాటిని సరి చేసుకోకుంటే త్వరలో జరిగే రీ సర్వేలో ఇబ్బందులు వస్తాయని నమ్మబలికిన ఆ ఉద్యోగి తప్పుల జాబితాతో గ్రామానికి చెందిన మధ్యవర్తి ప్రమేయంతో హల్‌చల్ చేస్తున్నాడు. ఇటీవల గ్రామంలోని పలువురి భూములను పట్టా భూములుగా మార్పు చేస్తామని చెప్పి వారి నుంచి లక్షల రూపాయల్లో డబ్బు వసూలు చేసి తిరిగి పట్టా భూమిగా మార్పు చేసిన సంఘటన గ్రామంలో హాట్ టాపిక్‌గా మారింది. మార్పు కోసం అధికారులందరికీ తాంబూళం ఇచ్చుకోవాలని ఎకరానికి 80 వేల రూపాయల చొప్పున బేరం కుదుర్చుకున్నట్లు తెలుస్తోంది. దీనిపై మంగళవారం నున్న గ్రామంలో బాధిత రైతులందరూ సమావేశం నిర్వహించుకొని రికార్డుల్లో తప్పులను సరిచేసుకొంటే మంచిదని రెవెన్యూ ఉద్యోగితో ఒప్పందం చేసుకున్నారని సమాచారం. ఈ విషయాన్ని మండల తహసీల్దార్ బి.సుగుణ వద్ద ప్రస్తావించగా ఎఫ్ఎల్ఆర్‌లో లేనిదే రికార్డులో మార్పు చేయడం సాధ్యం కాదన్నారు. మెట్టభూములు మాగాణిగా రికార్డులో తప్పులుంటే సరిచేయడం సాధ్యమవుతుందే తప్ప ఇనామ్, చెరువు, భూములను మార్పు చేయడం కుదరదని తేల్చి చెప్పారు.

పాతపాడులో నీటికుంటల తవ్వకం పనులు

పాతపాడు(విజయవాడరూరల్): ఉపాధి హామీ పథకంలో అయిదెకరాల లోపు వ్యవసాయ భూములున్న రైతులకు భూగర్భ జలాలను అభివృద్ధి పర్చుకునే నీటికుంట(ఫామ్‌పాండ్)లను తవ్వడం జరుగుతుందని ఇంజినీరింగ్ కన్సల్టెంట్ కె.శ్రీనివాసరావు తెలిపారు. పాతపాడు గ్రామంలో బి.సాంబిరెడ్డికి చెందిన మామిడి తోటలో జరుగుతున్న ఫామ్‌పాండ్ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. నీటి సదుపాయం లేని వ్యవసాయ భూముల్లో నీటికుంటలను ఉపాధి కూలీల ద్వారా తవ్విస్తున్నామన్నారు. నీటి కుంటల వలన భూగర్భ జలాలను అభివృద్ధి పర్చుకునే వీలుందని చెప్పారు. నీటి సదుపాయం పుష్కలంగా ఉన్న భూముల్లో పంట దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయన్నారు. ఈ ఏడాది మండలంలో 60 మంది రైతులకు నీటికుంటలను తవ్వేందుకు లక్ష్యంగా నిర్ణయించుకున్నట్లు తెలిపారు. రైతులకు నీటికుంటలు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ఈసీతో పాటు టెక్నికల్ అసిస్టెంట్ కిరణ్మయి ఉన్నారు.

ఏకగ్రీవానికి టీడీపీ నీచ రాజకీయాలు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు ఉపసర్పంచ్ పదవిని ఏకగ్రీవం చేసేందుకు టీడీపీ నాయకులు నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారు. పంచాయతీ కార్యాలయంలో గురువారం ఉదయం 11 గంటలకు జరగనున్న ఎన్నికల నేపథ్యంలో నాటకీయ పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. వార్డు సభ్యురాలు ఒంగూరు పుణ్యవతి తన ఉపసర్పంచ్ పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. దీంతో ఈ స్థానం ఖాళీ అవ్వడంతో ఉప సర్పంచ్ పదవిని చేజిక్కించుకునేందుకు టీడీపీ నాయకులు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. ఉప సర్పంచ్ పదవి రేసులో 11వ వార్డు సభ్యుడు కత్తుల శ్రీనివాస్‌కు వైఎస్సార్ సీపీ వార్డు సభ్యుల మద్దతు, ఆరో వార్డు సభ్యుడు అద్దెపల్లి సాంబశివనాగరాజుకు కూటమి నాయకుల మద్దతుతో బరిలో నిలబడ్డారు. కాగ కత్తుల శ్రీనివాస్‌కు మెజార్టీ వార్డు సభ్యులు మద్దతు ఇస్తున్నారని టీడీపీ నాయకులు బెదిరింపుల పర్వానికి తెరలేపారు. వైఎస్సార్ సీపీ వార్డు సభ్యులు పలువురికి పోలీసులు, టీడీపీ నాయకుల మంటూ బెదిరింపు ఫోన్లు వస్తున్నాయని చెబుతున్నారు. మరో వైపు బరిలో నిలబడిన కత్తుల శ్రీనివాస్ ప్లాట్‌కు విద్యుత్ ఫ్యూజులు తీయడం, గతంలో నిర్మించిన ఓ కట్టడానికి నోటీసులు ఇవ్వడం వంటి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. మొత్తం 20 మంది వార్డు సభ్యులు ఉన్న ఈ పంచాయతీలో సర్పంచ్ ఓటుతో కలుపుకుని మొత్తం 21 ఓట్లు అవుతాయి. ఉప సర్పంచ్ ఎన్నికలో వార్డు సభ్యులు చేతులెత్తి తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ నేపథ్యంలో వార్డు సభ్యులను తమ వైపు తిప్పుకుని ఉప సర్పంచ్ స్థానాన్ని ఏకగ్రీవం చేసేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు.

విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ఎస్ఈ సాంబశివరావుకు బొకే అందజేస్తున్న నేతలు

పెనమలూరు: విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని విద్యుత్ కార్మిక సంఘ నాయకులు ఎస్ఈని కోరారు. విజయవాడ విద్యుత్ కార్యాలయంలో సూపరిటెండెంట్ ఇంజినీర్ పి.సాంబశివరావును కార్మిక సంఘ నేతలు బుధవారం కలిసి సమస్యలు విన్నవించారు. కార్మిక సంఘం జిల్లా నాయకుడు పీవీ సుబ్బారావు వివరాలు తెలుపుతూ ఏఎల్ఎం గ్రేడ్ 2 ఉద్యోగులకు సెలవు, ప్రమోషన్స్, బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు. షిఫ్ట్ ఆపరేటర్స్‌కు వేతనంతో కూడిన సెలవులు ఇవ్వాలని, ప్రతి ఏడాది డీపీసీ నిర్వహించి ఎప్పటికప్పుడు ఉద్యోగులకు ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. నేతలు టీకేకే గణేష్, మూర్తి, ఎస్ఆర్‌కే ప్రసాద్, కిరణ్ పాల్గొన్నారు.

ఉపాధి హామీతో భారీగా అభివృద్ధి పనులు



మాట్లాడుతున్న పీడీ శివశంకర్

ఉయ్యూరురూరల్: ఉపాధి హామీ పథకాన్ని పూర్తిస్థాయిలో అమలుపరిచి కూలీలకు ఉపాధి కల్పించాలని డ్వామా పీడీ ప్రొసీడింగ్స్ అధికారి శివశంకర్ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజా వేదిక మండల స్థాయి సభ నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా రైతన్నకి ఎంతగానో మేలు జరుగుతుందన్నారు. సాగునీరు పంటలకు అందించేందుకు పంట బోధలను పంట కాలువలను పూర్తిస్థాయిలో పూడిక తీసి అభివృద్ధి పరుస్తున్నామని చెప్పారు. 2023- 24 సంవత్సరానికిగాను మండలంలో 11 గ్రామాల పరిధిలో 1,86,350 పని దినాలు కల్పించామని 6,194 అభివద్ధి పనులు చేశామని, అందుకుగాను రూ.6.45 లక్షలు నిధులు ఖర్చు చేశామన్నారు. సభలో ఇలాంటి పరిస్థితి భారతదేశం అంబర్స్మెంట్ కె.శ్రీనివాసరావు, ఎంపీడీవో శేషగిరిరావు, క్వాలిటీ కంట్రోల్ జెక్యూసి ప్రసాద్, విజిలెన్స్ అధికారి సురేష్, ఏపీవో నాగరాజు, డీఆర్పీలు, ఎస్ఆర్పీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మహాత్ముని విగ్రహం ఏర్పాటుకు ఆర్యవైశ్య సంఘం విరాళం



గన్నవరం: స్థానిక గాంధీబొమ్మ సెంటర్‌లో జాతీయ రహదారి పక్కన మహాత్మాగాంధీ కాంస్య విగ్రహం ఏర్పాటుకు ఆర్యవైశ్య సంఘ సభ్యులు ముందుకువచ్చారు. మహాత్ముని విగ్రహం ఏర్పాటుతో పాటు సుందరీకరణకు ఆర్యవైశ్య సంఘం తరఫున రూ.4.55 లక్షలు విరాళాన్ని బుధవారం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పట్టణం ముఖ్య కూడలిలో ఉన్న మహాత్ముని రాతి విగ్రహం శిథిలావస్థకు చేరుకుందన్నారు. దీని స్థానంలో కొత్త కాంస్య విగ్రహం ఏర్పాటు చేసి గ్రీనరీ, సుందరీకరించడానికి ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. ఆర్యవైశ్య సంఘ నేతలు స్వచ్ఛందంగా భారీ విరాళం ఇవ్వడం అభినందనీయమన్నారు. సంఘ నాయకులు మడుపల్లి బాలకృష్ణమూర్తి, జి.బాలశంకర్, జి.యజ్ఞనారాయణ, కందగడ్డల శ్రీనివాసరావు, తాడికొండ ప్రసాద్, సీహెచ్ బాజీప్రసాద్, కూర్మాల సత్య శ్రీనివాస్‌కుమార్, రామ్మోహన్‌గుప్తా, అప్పల బాలకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

పోలవరం కాల్వ గట్టుపై మట్టి అక్రమ తవ్వకాలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: రేమల్లేలో పోలవరం కుడి ప్రధాన కాల్వ గట్టు వద్ద అధికార టీడీపీ నేతలు మట్టి అక్రమ తవ్వకాలు చేపట్టారు. కాల్వ గట్టుపై జేసీబీ సాయంతో బుధవారం అక్రమంగా మట్టి తవ్వి తెలుగు తమ్ముళ్ల సొంత పొలాల్లోకి తరలించటంతో వివాదం రాజుకుంది. దీనిపై గ్రామస్తులు బాపులపాడు తహసీల్దార్ బి.మురళీకృష్ణకు ఫోన్‌లో ఫిర్యాదు చేయటంతో వెంటనే వీఆర్వోను ఘటనాస్థలికి పంపారు. అనుమతి లేకుండా మట్టి తవ్వకాలు సాగించటంపై చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ చెప్పారు. క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టిన వీఆర్వో మేరి తక్షణమే మట్టి తవ్వకాలు నిలిపివేయాలని ఆదేశించినప్పటికీ టీడీపీ నేతలు ససేమిరా అన్నారు. గ్రామానికి చెందిన కొందరు యువకులు అక్రమ మట్టి తవ్వకం వీడియోలు సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయటంతో కొద్దిసేపటికే వైరల్ కావటంతో నిలిపివేశారు. కేవలం కాల్వ గట్టుపై పిచ్చి మొక్కలు పెరగటంతో కోతల బెడద అధికంగా ఉందని, దాని కోసం జంగిల్ క్లియర్ చేస్తున్నామంటూ టీడీపీ నేతలు మాటమార్చారు.

దేశ రక్షణలో యువత భాగస్వామ్యం అవసరం



ఫైరింగ్ రేంజ్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కల్నల్ బాలేందర్ సింగ్

ఉయ్యూరు: దేశ రక్షణలో యువత భాగస్వామ్యం అవసరమని విజయవాడ బాలికల బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ బాలేందర్ సింగ్ అన్నారు. ఉయ్యూరులోని శ్రీ శ్రీనివాసా అక్షరాలయంలో ప్రత్యేక ఫైరింగ్ రేంజ్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. క్యాంప్‌ను కల్నల్ బాలేందర్ సింగ్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎన్‌సీసీ పట్ల మక్కువ చూపాలన్నారు. ఎన్‌సీసీతో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, దేశభక్తి పెంపొందుతుందని చెప్పారు. దేశ రక్షణలో భారత సైన్యం పాత్రను వివరించారు. భద్రతా నియమాలు, ఫైరింగ్‌లో మెలకువలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఐ రామారావు, ఎస్ఐలు విశ్వనాథ్, సురేష్ బాబు, విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ పరుచూరి శ్రీనివాసరావు, డైరెక్టర్ పరుచూరి నీలిమ, సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకుంటున్న ఎమ్మెల్యే ప్రసాద్

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీలో సమస్యలు పరిష్కరించాలని స్థానిక ప్రజలు కోరారు. పోరంకిలోని మున్సిపాలిటీ కార్యాలయంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అధ్యక్షతన బుధవారం ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. కానూరు, యనమలకుదురు, పోరంకి ప్రాంతాల నుంచి ఫిర్యాదులు అందాయి. ప్రధానంగా డ్రెయినేజీల నిర్మాణం చేయాలని, రోడ్లు వేయాలని, పారిశుద్ధ్యం అధ్వానంగా ఉందని అర్జీలు ఇచ్చారు.

పన్నులు కడితేనే అభివృద్ధి పనులు

తాడిగడప మున్సిపాలిటీలో నిధుల కొరత ఉందని ప్రజలు పన్నులు చెల్లిస్తేనే అభివృద్ధి పనుల చేయగలుగుతామని ఎమ్మెల్యే ప్రసాద్ అన్నారు. మున్సిపాలిటీకి నిధుల కొరత ఉందన్నారు. త్వరలో మున్సిపాలిటీకి ఎన్నికలు ఉంటాయని, ఎన్నికలు జరిగితే ఆర్థిక సంఘం నిధులు వస్తాయన్నారు.

స్పందన కరువు

ఎమ్మెల్యే నిర్వహించిన ప్రజా దర్బార్‌కు ప్రజల నుంచి స్పందన కనబడలేదు. ప్రజలు పెద్ద ఎత్తున వస్తారని పాలకులు భావించగా పలు కాలనీలకు చెందిన వారు మాత్రమే వచ్చారు. మున్సిపాలిటీ అధికారులకు సమస్యలపై అనేక సార్లు ఫిర్యాదులు చేసినా స్పందన లేదని, ప్రజాదర్బార్ వలన ఒరిగేది ఏమీ లేదని ప్రజలు పెదవి విరిచారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ భవానీప్రసాద్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల సంక్షేమానికి కృషి



ఆర్థిక సాయం అందజేస్తున్న మాదు శ్రీహరిరాణి, జెడ్పీటీసీ బాకీ బాబు తదితరులు

కంకిపాడు: కార్యకర్తల సంక్షేమానికి పార్టీ కృషి చేస్తోందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షురాలు మాదు శ్రీహరిరాణి, జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు అన్నారు. కంకిపాడు పట్టణానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత, ముస్లిం మైనార్టీ నేత షేక్ హుస్సేన్ అలియాస్ బెంజ్ ఇటీవల మృతి చెందటంతో పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి తన వంతుగా రూ.10 వేలు సాయాన్ని అందించారు. ఈ మొత్తాన్ని పార్టీ నేతలతో కలిసి బుధవారం బాధిత కుటుంబానికి అందజేశారు. మాదు శ్రీహరిరాణి, బాకీ బాబు మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందన్నారు. అధైర్యపడొద్దని, సమష్టిగా క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయటంలో ప్రతి ఒక్కరూ పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు చిట్టూరి ప్రసాద్, సీహెచ్‌సీ మాజీ చైర్మన్ మేదంద్రావు కుటుంబరావు, పార్టీ నాయకులు తంబాబత్తుల ఓంకారం, కలపాల వజ్రాలు, మాదు రాఘవేంద్ర, కరీముల్లా, విజయ్‌కుమార్, బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీతిరుపతమ్మ కల్యాణ వేదిక ప్రారంభోత్సవం



కల్యాణ వేదికను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ, జాస్తి, దాసరి

గన్నవరం: స్థానిక పాత గన్నవరంలోని శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయం ఆవరణలో నూతనంగా నిర్మించిన కల్యాణ వేదిక ప్రారంభోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు, మాజీ ఎమ్మెల్యే దాసరి వెంకటబాలవర్ధనరావుతో కలిసి కల్యాణ వేదికను ప్రారంభించారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ.. జాస్తి చౌదరయ్య, సుశీలదేవి సౌజన్యంతో అమ్మవారి భక్తుల సహాయ, సహకారాలతో కల్యాణ వేదికను సకల సౌకర్యాలతో నిర్మించడం అభినందనీయమన్నారు. శ్రీలక్ష్మీతిరుపతమ్మ కల్యాణ వేదికకు తన వంతుగా రూ.2 లక్షలు విరాళంగా ఇస్తున్నట్లు ఆయన ప్రకటించారు. అమ్మవారి కల్యాణ వేదిక నిర్మాణానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిపారు. తహసీల్దార్ కె.వెంకటశివయ్య, వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్, సర్పంచ్ నిడమర్తి సౌజన్య, ఉప సర్పంచ్ పాలడుగు నాని, ఏఎంసీ మాజీ చైర్మన్ కోటగిరి వరప్రసాదరావు, మాజీ సర్పంచ్‌లు గూడపాటి తులసీమోహన్, తుల్లిమిల్లి ఝాన్సీలక్ష్మి, ఆలయ కమిటీకి చెందిన జాస్తి ఫణికుమార్, కాసన్నేని నాని, నర్రా గిరి, జాస్తి శ్రీను పాల్గొన్నారు.

పాస్టర్ మృతిపై న్యాయ విచారణ చేపట్టాలి



విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్న పాస్టర్లు

ఉయ్యూరు: పాస్టర్ ప్రవీణ్ మృతిపై న్యాయవిచారణ జరపాలని ఉయ్యూరు మండల పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు పాస్టర్ మాచవరపు రాజేష్ డిమాండ్ చేశారు. ఉయ్యూరు శ్రీలంక కాలనీలోని ప్రార్థనా మందిరంలో పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతికి సంతాపం తెలిపారు. న్యాయ విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. పాస్టర్ రాజేష్ మాట్లాడుతూ.. పాస్టర్ ప్రవీణ్ మృతి క్రైస్తవుల హృదయాలను కలచివేసిందన్నారు. ప్రభుత్వం సమగ్ర న్యాయ విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫెలోషిప్ ప్రతినిధులు జాన్‌క్రాస్, రాజేష్, పలువురు పాస్టర్లు పాల్గొన్నారు.

సమగ్ర విచారణ జరిపించాలి

గన్నవరం: పాస్టర్ ప్రవీణ్ మృతిపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాచేటి మురళీ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక గాంధీబొమ్మ సెంటర్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరసన తెలపడంతో పాటు తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. మురళీ మాట్లాడుతూ.. రాజమండ్రిలో జరిగిన పాస్టర్ ప్రవీణ్ మృతి పట్ల అనేక అనుమానాలు ఉన్నాయన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు దారికాచి ప్రవీణ్‌ను హత్యచేసి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. క్రైస్తవ సువార్తకుడిపై ఈ తరహా ఘటనకు పాల్పడడం బాధకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రవీణ్ మృతిపై నిజాలను నిగ్గుతేల్చాలని డిమాండ్ చేశారు. టి.దేవసహాయం, మోజేస్, తిరివీధి నాని, బత్తుల రమేష్, బిక్షలు, పోలిమేర పేతురు, దేవరపల్లి కరుణనిధి పాల్గొన్నారు.

విద్యుత్ వైర్లు తగిలి వరిగడ్డి ట్రాక్టర్ దగ్ధం

ఉంగుటూరు: విద్యుత్ వైర్లు తగిలి వరిగడ్డి ట్రాక్టర్ దగ్ధమైన సంఘటన వెన్నూతల గ్రామంలో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వెన్నూతల గ్రామానికి చెందిన అంగడాల హనుమంతరావు తన పొలంలోని వరిగడ్డిని ట్రాక్టర్‌పై ఇంటికి తరలించే క్రమంలో అగ్నిప్రమాదం సంభవించింది. నందివాడ మండలం ఒద్దులమెరక గ్రామానికి చెందిన పుట్టి నాగేశ్వరరావు తన బంధువైన హనుమంతరావు వద్ద ఉంటూ ట్రాక్టర్‌పై వరిగడ్డి తరలిస్తుంటాడు. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం హనుమంతరావు పొలం నుంచి వరిగడ్డిని ఇంటికి తరలిస్తుండగా, దిమ్మిటి ప్రసాదరావు ఇంటి దగ్గర విద్యుత్ స్తంభాలు ఎత్తు తక్కువ ఉండటంతో వరిగడ్డికి విద్యుత్ తీగలు తగిలి నిప్పురవ్వలు లేచి మంటలు వ్యాపించాయి. దీంతో ట్రాక్టర్ డ్రైవర్ అప్రమత్తమై హుటాహుటీన ట్రాక్టర్‌ను కొద్ది దూరంలోని మంచినీటి చెరువులోకి పల్టీకొట్టించడంతో పెను ప్రమాదం తప్పింది. అయితే అప్పటికే వరిగడ్డికి ఇంజిన్‌కు పూర్తిస్థాయిలో మంటలు వ్యాపించడంతో టైర్లు పేలాయి. ఈ ఘటనలో రూ.15 వేలు విలువగల వరిగడ్డితోపాటు ట్రాక్టర్ దగ్ధమైంది. సుమారు రూ.5 లక్షలు ఆస్తినష్టం జరిగిందని బాధితుడు వాపోతున్నాడు. విద్యుత్ స్తంభం ఏర్పాటుకు రూ.22 వేలు చెల్లించాలని బిల్లులు వేయడంతో పంచాయితీలో నిధుల కొరతతో చెల్లించలేకపోయామని సర్పంచ్ చెప్పారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి పాత విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్త వాటిని ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.